క్లుప్తంగా

నియామకం



ఏటూరునాగారం: మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా మండల కేంద్రానికి చెందిన గీకురు భాగ్యను ఏకగ్రీవంగా ఆదివారం నియామించారు. తన సేవలను గుర్తించి పదవి ఇచ్చినందుకు పార్టీకి, నాయకులకు రుణపడి ఉంటానని భాగ్య తెలిపారు.

చేయూత



ములుగు రూరల్: మండలంలోని దేవగిరిపట్నం గ్రామానికి చెందిన నిరుపేదలకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేయూత అందించారు. ఆదివారం గ్రామంలోని చెంచుకాలనీలో 15 కుటుంబాలకు దుప్పట్లు, దుస్తువులు, వంట సామగ్రిని పంపిణీ చేశబూరు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అల్లెం అప్పయ్య మాట్లాడుతూ.. పేద ప్రజలను ఆదుకునేందుకు రెడ్ క్రాస్ సొసైటీ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు గంగిశెట్టి శ్రీనివాస్, రమేష్, రవీందర్‌రెడ్డి, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ములుగు రూరల్: మండలంలోని బరిగలానిపల్లికి చెందిన మట్టివాడ నరేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎస్‌బీఐ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు ఆదివారం పరామర్శించి రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు రాజేందర్, ఉద్యోగులు అహ్మద్, వీరన్న, అంకూష్, రవి, రాజీవ్, అశోక్, శ్రీను, రాజు, అశోక్, కిషోర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి గుండె సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో అతడిని రైతు విమోజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ జాజ చంద్రం, బీఆర్ఎస్ మండల మహిళ అధ్యక్షురాలు సోమ నాగమ్మ, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు నూశెట్టి రాము, ఎంపీటీసీ పరిధి సమన్వయ కోఆర్డినేటర్ బసాని రామకృష్ణ ఆదివారం పరామర్శించారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో విద్యార్థి ప్రతిభ



మొగుళ్లపల్లి: ఏప్రిల్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో హనుమకొండ జిల్లా పరకాల లోని శారద విద్యాలయం హై స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న మండలంలోని మేదరమెట్ల గ్రామానికి చెందిన బాలవేణి సరిత–వీరస్వామి దంపతుల కుమారుడు శ్రీ చరణ్ ప్రతిభ కనబరిచాడు. తొమ్మిదో తరగతి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో క్వాలిఫైడ్ అయినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మార్క సత్యనారాయణ ఆదివారం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లి గ్రామ శివారులోని పెద్ద వాగులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆర్ఐ శివరామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ చంద్రకాంత్, రాజు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా వరికోల్ గ్రామానికి చెందిన ప్రభుత్వ టీచర్ సాంబశివరావుకి చెందినది అని తెలిపినట్లు వారు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా వాగుల నుంచి ఇసుకను తరలించినట్లయితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సునీతరెడ్డి హెచ్చరించారు. కొంతమంది వ్యక్తులు రాత్రి వేళల్లో వాగుల నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇలాంటి వ్యక్తులు ఎవరైనా సరే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రేగొండ: పరకాల పట్టణానికి చెందిన శ్రీను రేగొండ నుంచి పరకాలకి వెళ్తుండగా ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు వివరాలు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించారు. ఈ మేరకు బాధితుడికి ఎస్సై షాఖాన్ ఆదివారం అందజేశారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, ఈ పోర్టల్ ద్వారా ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు.

ఏజెన్సీలో రోడ్ల నిర్మాణాలు



బంధాలలో వేసిన బీటీ రోడ్డు



కొడిశాల నుంచి పోచాపూర్ వరకు పీసీసీ రోడ్డు పనులు

- రూ.12కోట్లతో పనులు
- గిరిజనులకు తీరనున్న రవాణా కష్టాలు

ఎస్ఎస్‌తాడ్వాయి: మారుమూల అటవీ ప్రాంతంలోని అటవీ గ్రామాల్లోని పచ్చని అడవుల్లో నల్లదారులు నిర్మిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే లింగాల అత్యంత మారుమూల ప్రాంతంలో ఉంటుంది. పస్రా నుంచి లింగాల వరకు బీటీ రోడ్డు మినహా మిగత అటవీ గ్రామాలకు ఏళ్ల తరబడి నుంచి మట్టి రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. వర్షాలకు వాగులు వంకలు పొంగిపోర్లడంతోపాటు రోడ్ల సౌకర్యం లేక వైద్య, విద్య పరంగా అనేక ఇబ్బందులు పడేవారు. ఎడ్లబడ్లు, ట్రాక్టర్‌లో అత్యవసర వైద్య సేవలకు కొడిశాల వరకు తరలించి అక్కడి నుంచి వాహనాల్లో ప్రసాకు తరలించేవారు. మంత్రి సీతక్క మారుమూల గ్రామల్లోని రోడ్ల అభివృద్ధిపై మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించి రోడ్ల నిర్మాణానికి కృషి చేశారు. సీతక్క కృషితో అటవీ గ్రామాల్లోని రోడ్ల రూపు రేఖలు మారిపోతున్నాయి. బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.12కోట్ల నిధులను మంజూరు చేసింది. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఇప్పటికే రెండు గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం పనులు పూర్తయ్యాయి.

నిర్మాణాలు పూర్తి

పోచాపూర్ నుంచి బంధాల వరకు 5 కిలోమీటర్ల మేరకు రూ. 3.80కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. అలాగే లింగాల బీటీ రోడ్డు నుంచి బొల్లెపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేశారు. రూ.4.20కోట్లతో 5 కిలోమీటర్ల దూరం వరకు అటవీ ప్రాంతం నుంచి బీటి రోడ్డు నిర్మించారు.

కొడిశాల బీటీ రోడ్డు నుంచి పోచాపూర్‌కు..

కొడిశాల బీటీ రోడ్డు నుంచి పోచాపూర్ వరకు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. కొడిశాల నుంచి పోచాపూర్ దారి గుట్టపై నుంచి వెళ్లాల్సి ఉంది. పోచాపూర్ వాసులకు కొడిశాల వరకు నలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈరోడ్డు మార్గం వారికి దగ్గరగా ఉంటుంది. ప్రస్తుతం కొడిశాల నుంచి పోచాపూర్ వరకు పీసీసీ (బెస్‌స్థాయి పనులు) దానికి మళ్లీ సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టనున్నారు. మరి కొంత మిలిగిన ప్రాంతంలో బీటీ రోడ్డు నిర్మించనున్నారు.



పోచాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం



కొడిశాల మార్గంలో వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి

తీరనున్న వరద కష్టాలు

పోచాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులు దాదాపుగా పూర్తి దశకు చేరుకున్నాయి. ఈ పనులను గత రెండేళ్ల క్రితం చేపట్టారు. వాగు అనుకుని పోచాపూర్ గ్రామంలో మీని గురుకులం పాఠశాల ఉంది. ప్రతి ఏటా వర్షకాలంలో వాగు ఉధృతంగా ప్రవాహించడంతో వాగు వరద నీరు పాఠశాల వరకు వెళ్లడంతో గతంలో వాగు వరదలో నుంచి అధికారులు విద్యార్థినులను బయటకు తరలించి పునరావాస కేంద్రాలకు తరలించేది. వరద తగ్గిన తర్వాత వెళ్లేవారు. బ్రిడ్జి నిర్మాణంతో వాగులో వరద కష్టాలు తీరానున్నాయి. అలాగే కొడిశాల నుంచి పూచాపూర్ మార్గంలో వాగుపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. పిల్లర్లు వేసి స్లాబ్ కూడా వేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పోచాపూర్, అల్లిగూడెం, బంధాల, బొల్లెపల్లి, నర్సాపూర్ గ్రామాల గిరిజనులకు రవాణా సౌకర్యం పూర్తిగా మెరుపడనుంది.

సంతోషంగా ఉంది..



అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన గ్రామాలకు బీటి రోడ్లు నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. రోడ్ల నిర్మాణంతో గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. అత్యవసర సమయంలో గతంలో వర్ష కాలంలో వైద్య సేవలకు, నిత్యావసర సరులకు ఇబ్బందులు పడేది. బ్రిడ్జిలు రోడ్ల నిర్మాణంతో రవాణా ఇబ్బందులు తొలుగుతాయి. మంత్రి సీతక్క కృషితోనే రోడ్లు అభివృద్ధిగా చెందుతున్నాయి.

– తొలెం నర్సయ్య, బంధాల

పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్ల నిర్మాణంతో మా చిరకాల కళ నేరివేరింది. రోడ్ల నిర్మాణం పనుల్లో నాణ్యత పాటించాలి. రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అధికారులు సహకరించాలి. రోడ్ల నిర్మాణంతో గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయి. వర్షకాలం నాటికి రోడ్ల నిర్మాణం పనులన్నీ పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తోలెం అశోక్, పోచాపూర్

ఇసుక లారీలతో ట్రాఫిక్ జామ్



మంగపేట, కమలాపురం మధ్యలో నిలిచిపోయిన వాహనాలు

మంగపేట: మండలంలోని మంగపేట, మల్లూరు, చుంచుపల్లి వద్ద ఇసుక లారీల కారణంగా ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. మండల కేంద్రంలోని గోదావరి ఇసుక క్వారీ నుంచి వచ్చే వందలాది ఇసుక లారీలు రోడ్డుకు ఇరువైపులా అడ్డదిడండంగా నిలిపి వేయడంతో ఆదివారం గంపోనిగూడెం వద్ద మార్కెట్ గోడౌన్ల వద్ద నుంచి కమలాపురం వరకు కిలోమీటర్ల మేర రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. అదే విధంగా మల్లూరు వద్ద శనివారం సాయంత్రం రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రధాన రోడ్డుపై వచ్చిపోయే వందలాది ఇసుక లారీలు, ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు గంట పాటు ఎక్కడిక్కడే నిలిచి పోవడంతో ప్రయాణికులు, వాహనదారులతో పాటు కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వెళ్లి వచ్చే భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు వేబ్రిడ్జీల వద్ద, రోడ్డుపై ఇసుక లారీలను నిలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



వెంకటాపురం(కె): జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



వాజేడులో..

వెంకటాపురం(కె): మండలపరిధిలోని వీఆర్‌కేపురంలో వాడబలిజ సేవా సంఘం ఆవిర్భావ వేడుకలను ఆదివారం నిర్వహించారు. సంఘం జెండాను రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లికార్జునరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాడబలిజల సమస్యల పరిస్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి చందు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, వాజేడు మండల అధ్యక్షుడు నాగార్జున, అధికార ప్రతినిధి ఆదినారాయణ, సురేష్ తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని కత్తిగూడెంలో వాడబలిజ సేవా సంఘం ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్, మండల అధ్యక్షుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం వ్యాన్ బోల్తా..



రాచపల్లి గ్రామ సమీపంలో పల్టీ కొట్టిన వ్యాన్



మృతి చెందిన పశువులు

- అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది పశువులు మృతి

వెంకటాపురం(కె): మండ పరిధిలోని రాచపల్లి గ్రామ సమీపంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వ్యాన్ బోల్తా పడి ఎనిమిది పశువులు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి 14 పశువులను డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. కాగా డీసీఎం వ్యాన్ శనివారం రాత్రి మండల పరిధిలోని రాచపల్లి గ్రామం మీదుగా ఏటూరునాగారం నుంచి హైదరాబాద్ వెళ్తుందని తెలిపారు. ఈ క్రమంలో రాచపల్లి గ్రామ సమీపంలో డీసీఎం వ్యాన్ పల్టీ కొట్టడంతో వ్యాన్‌లో ఉన్న ఎనిమిది పశువులు అక్కడి కక్కడే మృతి చెందాయని పేర్కొన్నారు. మిగిలిన ఆరు పశువులను స్వాధీనం చేసుకోని భూపాలపల్లి గోశాలకు తరలించినట్లు తెలిపారు. పశువులను తరలిస్తున్న అర్జున్, బాలకృష్ణ, మహమ్మద్ గౌస్ అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

వైభవంగా మైసమ్మ జాతర



అమ్మవారి వద్ద వేసిన పట్నం

వాజేడు: మండల పరిధిలోని కాచారం వద్ద మైసమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు తల్లడి పాపారావు, జెజ్జరి మధనయ్య ఆధ్వర్యంలో శనివారం రాత్రి పారేటి కుండల్లో బాలికలతో గోదావరి నుంచి జలాలను తీసుకు వచ్చి మైసమ్మ తల్లికి జలాభిషేకం చేశారు. ఆదివారం ఉదయం మైసమ్మ వద్ద పట్నం వేసి జాతరను ప్రారంభించారు. అనంతరం భక్తులు మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. మైసమ్మ తల్లి దర్శనం కోసం వచ్చే భక్తులకు ట్యాంకర్ ద్వారా తాగు నీటి సౌకర్యం కల్పించారు. సమీపంలో ఉన్న పగిడిద్ద రాజు చెట్టు వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం



మంత్రి సీతక్కకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గండ్ర, నాయకులు

భూపాలపల్లి రూరల్: మంత్రి సీతక్క ఆదివారం సాయంత్రం కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వెళ్తున్న క్రమంలో భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యే సన్మానించారు. పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంగపేట: మండలంలోని కమలాపురం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2000–01 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామగోవిందం, లక్ష్మీనర్సయ్య, షేక్ అహ్మద్, పూన్య, వెంకటేశ్వర్లు, రామస్వామి, జ్యోతి, పూర్వ విద్యార్థులు సరోజ, స్వరూప, దేవిక, విమల, సుధ, సుధాకర్, ఆదినారాయణ, రవి, వెంకెట్టి రాంబాబు, రంజిత్, నాగేష్, రమేష్, శ్రీను ఉన్నారు.

తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కాటారం: తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనగామ రవికుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు రాజబాబు డిమాండ్ చేశారు. మండలంలోని రేగులగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం మ్యాచర్ వచ్చి 25 రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడం శోచనీయం అన్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలతో ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన ధాన్యం తడిసిపోయిందన్నారు. కాంటాల్లో జాప్యంతోనే రైతులకు ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏట సంపత్, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచడానికే యాత్ర

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, తదితరులు

భూపాలపల్లి రూరల్: రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడం కోసమే రాజ్యాంగా పరిరక్షణ యాత్ర చేపట్టినట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీలోని 20, 21, 22 వార్డులు హనుమాన్ నగర్, శాంతినగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ, అంబేడ్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూలమాల వేశారు. అనంతరం అక్కడున్న నాయకులతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

గణపురం మండలం చెల్పూర్, గొల్లపల్లి, బస్వరాజుపల్లి గ్రామాలల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సివిల్ సప్లై, పోలీస్, మిల్లర్ల యజమానులు, లారీ ట్రాన్స్‌పోర్టు యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని సెంటర్లకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని సూచించారు. మిల్లర్లు సన్న ధాన్యం, తేమతో సంబంధం లేకుండా హనుమకొండ, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని మిల్లర్లు దిగుమతి చేసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లను ఫోన్‌లో కోరారు.

బురదమయంగా రహదారి



వాజేడు: మండల పరిధిలోని బాల లక్ష్మీపురం(పెనుగోలు కాలనీ) వెళ్లే రహదారి బురదమయంగా మారింది. వాజేడు నుంచి భద్రచలం వైపు వెళ్లే ప్రధాన రహదారి నుంచి పెనుగోలు కాలనీకి వెళ్లే రహదారి వర్షం పడడంతో చిత్తడిగా మారి నడవడానికి వీలు లేకుండా ఉంది. ఇటీవల ఉపాధి హామీ పథకంలో భాగంగా రహదారికి ఇరువైపులా కాల్వలు తీసి మట్టిని పోశారు. వర్షం పడగానే ఈ రహదారి చిత్తడిగా మారింది.

గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం

- గాయాలపాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు





కుక్క కాటుతో బాధితులకు అయిన గాయాలు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రాత్రి సమయంలో బయటకు వెళ్లాలేని పరిస్థితి. చిన్నా పెద్ద తేడా లేకుండా గ్రామస్తులను పిచ్చికుక్కలు కరుస్తూ గాయపరుస్తున్నాయి. దీంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొంపెల్లి గ్రామంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు గ్రామంలో దొరికిన వారిని దొరినట్లు కరిచి పిచ్చి కుక్క బీభత్సం సష్టించింది. కుక్క దాడిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కొంపల్లి గ్రామంలో 11 మందిపై, రెండు గేదెలు, దుడ్డెపై దాడి చేసి గాయపరిచింది. బాధితులు భూపాలపల్లి ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో చికిత్స పొందారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



గాయాల పాలైన పాప

కుక్కలను లేకుండా చేయాలి



శనివారం రాత్రి 10:30 గంటలకు కుటుంబ సభ్యులం మాట్లాడుకొని ఇంట్లోకి వెళ్తున్నాం. ఈ క్రమంలో కుక్క వచ్చి కాలు మడమ పట్టుకోవడంతో బలంగా లాగేశాను. రక్తం రావడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నా. గాయం మానడానికి చాలా సమయం పట్టిల ఉంది. గ్రామంలో ఇంక పిచ్చి కుక్కలు ఉన్నాయి. అధికారులు కుక్కలను తరిమివేయాలి.

–ఎడ్ల నవీన్, కొంపెల్లి

కుక్క కరిచింది..



శనివారం రాత్రి కుక్క కరిచిన నవీన్‌ను ఆదివారం ఉదయం చూడడానికి వెళ్లాను. పిచ్చి కుక్క ఎక్కడనుంచి వచ్చిందో చేతిపై, పొట్టపై కరిచింది. ఆస్పతితో చికిత్స తీసుకున్నా. గ్రామంలో కుక్కలను లేకుండా చేయాలి.

– సదాల పైడయ్య, కొంపెల్లి